# వెచ్చని కౌగిలి

**కొత్త నవీన్**

"అరుణా... అరుణా" గట్టిగా పిలిచాను లేస్తూనే.

"ఏంటండీ..." కిచెన్ రూమ్‌లోంచి జవాబు వచ్చింది సన్నగా.

"ఎక్కడ నుండి" అడిగాను.

"వంటగదిలో నుండి. టైమ్ తొమ్మిదవుతోంది... త్వరగా లేవండి".

బెడ్ మీద నుండి లేచి ఒళ్ళు విరుచుకొని వంటగది వైపు నడిచాను. వంటగదిలో అడుగు పెట్టబోయి అలాగే ఆగిపోయాను. ఎదురుగా అరుణ గంధపు రంగు ముతక చీరలో అందంగా కనిపిస్తోంది. ఆమె అందాన్ని చూస్తూ అలాగే నిల్చుండిపోయాను. అరుణ తల త్రిప్పి...

"ఏయ్! ఏంటి అలా చూస్తున్నావ్" అడిగింది.

"కవులకు అంతటి తియ్యని కవిత్వము, శిల్పులకు అంత చక్కని శిలలను మలచడం ఎలా సాధ్యమవుతుందా అనుకునేవాణ్ని. కానీ మధు బిందువులతో చేసిన నీ అందం నీరు కోసిన ఏటి ఒడ్డులాంటి ఒయ్యారమైన నీ నడుము, లలితమైన నీ నవ్వు చూస్తుంటే కవులు, శిల్పులు అంతటి గొప్పవాళ్లు ఎలా అయ్యారో పూర్తిగా అర్థమయింది."

"మీరు చేస్తానంటే నాకెటువంటి అభ్యంతరమూ లేదు" కొంటెగా అంది. నేను మెల్లగా వెళ్ళి నడుం చుట్టూ చేతులు వేసి మెడ ఒంపులో తల ఆన్చి...

"ఓ ముద్దు ఇవ్వవా!" అని మత్తుగా అడిగాను.

"ఒక్కటి చాలా" క్రీగంటు నవ్వుతూ అంది.

"ప్రస్తుతానికి ఒక్కటి చాలు" అంటూ ఆనందంతో నునుపైన ఆ బుగ్గ మీద చుంబించబోయిన నేను 'కెవ్వ్' అని అరిచి చేయిని వెనక్కి లాగాను.

"ఏమైందండి" ఏమీ ఎరగనట్టు మొహం పెడుతూ అడిగింది.

"చేతి మీద వాత పెట్టి... ఇంకా ఏమైందండి అని అడుగుతావా"

"ఇంకొకటి ఇవ్వమంటారా?"

"అక్కర్లేదులే' అంటూ బాత్ రూం వైపు నడిచాను.

"మీ కవిత్వం ఆపి, వెళ్ళి మొహం కడుక్కురండి. కాఫీ వేడి చేస్తాను."

"కాఫీతో స్నానమా' చిరునవ్వుతో ప్రశ్నించాను.

"త్వరగా రండి నాకు టైం అవుతోంది"

"ఆ... అలాగే' అంటూ కవ్వింపుగా అని బాత్రూమ్‌లోకి వెళ్ళాను.

*** *** *** ***

అరుణను ఇన్స్‌ట్యూట్ దగ్గర డ్రాప్ చేసి ఫ్రెండ్ ఇంటికి వెళ్ళాను.

"ఒరేయ్! నీ ఫ్రెండ్ ఆ అమ్మాయిని సి.ఎ. చదివిస్తున్నాడుటగా. రేపొద్దున్న ఆ అమ్మాయి వీణ్ని లెక్క చేస్తోందంటావా!" అన్న మాటలు గుమ్మం దగ్గర నిలబడ్డ నాకు ఈటెల్లా వచ్చి గుచ్చుకున్నాయి. ఇక అక్కడ నిలబడలేక వెనక్కి తిరిగి ఇంటికి వచ్చేశాను. ఆ రోజు ఏ పని చేయాలన్న మనసు లగ్నం చేయలేకపోతున్నాను. ఇంటికి చేరాక బెడ్ మీద పడుకొని ఎంతసేపు ఆలోచించాను నాకే తెలియదు. బాధను దిగమింగలేక కన్నీళ్ళు కళ్ళ వెంబడి జారాయి. అరుణ మనస్సు మారుతుందా? సి.ఎ. పూర్తయితే నన్ను లెక్క చేయదా! అన్న ఆలోచనలు ఫెను తుఫానుతో బుర్ర వేడెక్కిపోయింది. ఇంతలో తలుపు శబ్దం వినబడగానే నీరసంగా వెళ్ళి తలుపు తీశాను. ఎదురుగా అరుణ నవ్వుతూ.

"ఈ రోజు రాలేదేంటండి. మీరు వస్తారని చాలా సేపు ఎదురు చూసాను తెలుసా"

తెచ్చి పెట్టుకున్న నవ్వుతో "ఒంట్లో బాగోలేదు అరుణా!" మెల్లగా సమాధానమిచ్చాను.

నా మాట వింటూనే చేతిలోని హ్యాండ్ బ్యాగ్, పుస్తకాలు అవతలకు విసిరేసి గబగబ వచ్చి నా చేయి పట్టుకొని మెడ క్రింద చేయి పెట్టి చూసి...

"ఒళ్ళు ఏమి కాలటం లేదు. ఎందుకైనా మంచిది. ఓసారి డాక్టర్ దగ్గరకు వెళదాం పదండి"

అరుణ కళ్ళల్లోకి ఆరాధనగా చూస్తూ మాటలు రానివాడిలా అలాగే చూస్తుండిపోయాను.

"ఏమైంది అలా చూస్తున్నారు"

భారంగా గాలి పీల్చుకొని "అరుణా! నీకంటే చదువులో తక్కువ వాణ్ని కదా. నీకు నామోషీగా లేదా" అని సూటిగానే అడిగేసాను. నా మాట వినిపించుకోనట్టు గబగబ వంటగదివైపు అడుగులు వేసింది. నేను అరుణ వెనకాలే వెళ్ళి,

"అరుణా! సమాధానం చెప్పలేదేంటి?"

"తల తోక ప్రశ్నలకు ఏమని సమాధానం

**★ బాగా చదువుకున్న భార్యలు, భర్తల్ని చిన్నచూపు చూస్తారా? అలాంటి పరిస్థితిలో భర్తలకు మిగిలింది బాధపడడం ఒక్కటేనా?**

చెప్పమంటూరు" అంటూ కొన్త విరాకుగానే సమాధానమిచ్చింది.

"నిజంగా నామోపీగా ఉండదా" అని మళ్ళీ అడిగాను. దానికి అరుణ మ్రరున నావైపు చూసి...

"చూడండి. మీరంటే నాకు ప్రాణం. మిమ్మల్ని విడిచి నేను ఉండలేను. అనే డైలాగులు చెప్పడం నాకిష్టం లేదు. నా ఇష్ట పూర్వకంగా మిమ్మల్ని పెళ్ళి చేసుకున్నాను. ప్రేమానురాగాలు మాటల్లో ఉండవు. మనసుల్లో ఉండాలి" అంటూ ఏడుస్తూనే సమాధానం చెప్పింది. సున్నితమైన ఆమె చెక్కిళ్ళ మీద నుండి ధారలుగా కారుతున్న కన్నీళ్ళను చూస్తుంటే ఆమె మనస్సు ఎంత మదన పడుతుందో తెలుస్తూంది.

**మీరంటే నాకు ప్రాణం. మిమ్మల్ని విడిచి నేను ఉండలేను.**

ఆ సున్నితమైన మనస్సును నొప్పించినందుకు నా మీద నాకే అసహ్యం కలిగింది. ఎంత ఆపుదామనుకున్నా నాలో కట్టలు తెంచుకొని వస్తున్న దుఃఖం ఆగటం లేదు. మనస్సంతా విషాదం చోటు చేసుకుంది. అరుణను దగ్గరగా తీసుకుంటూ...

"ఓ స్త్రీ తనకు కాబోయే భర్త గుణవంతుడు, యోగ్యుడు అయి ఉండాలని ఎలా కోరుకుంటుందో అలాగే ఓ మగాడు కూడా తనకు కాబోయే భార్య గురించి అలాగే కోరుకుంటాడు. ఆ షిర్డీ సాయినాథుడ్ని నా కలిందమయిన భార్యను ఇవ్వమని ఏనాడు కోరలేదు. గుణవంతురాలయిన భార్యను కావాలనే కోరుకున్నా. కానీ పువ్వులోనే మకరందంలా అందం, గుణం కలిసిన నీలాంటి భార్యను నాకు ప్రసాదించాడు. నిజంగా నేను చాలా అదృష్టవంతుడ్ని"

నా మాట పూర్తికాకముందే అరుణ వచ్చి నన్ను లతలా పెనవేసుకు పోయింది. నా గుండెలపై తన తల ఆన్చి, వెక్కి వెక్కి ఏడుస్తూ...

"ఇంకెప్పుడూ ఇలాంటి అనుమానాలు పెట్టుకోకండి. పువ్వు పవిత్రమైన దేవుడి సన్నిధిలో ఉండిపోవాలని కోరుకుంటుందే కాని గాలికో, ధూళికో కొట్టుకు పోవాలనుకోదు" అంటూ.



గాలి కూడా చొరబడనంత గట్టిగా కౌగిలించుకుంది. ఆ కౌగిలి వెచ్చగా ఉంది. వెచ్చని కౌగిలిలో అరుణ నలిగిపోతుంది. ఇప్పుడు నాలో ఏ రకమైన అనుమానాలూ లేవు. ●